సాక్షి పెద్దపల్లి

శనివారం, 11, నవంబర్, 2023

చెక్‌పోస్టుల తనిఖీ



పెద్దపల్లిరూరల్/ఓదెల: పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చెక్‌పోస్టులను ఎన్నికల పరిశీలకుడు శ్రీధరన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి, ఓదెల మండలం గుంపుల చెక్‌పోస్టులను సందర్శించిన అబ్జర్వర్.. అక్కడ విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహనాల తనిఖీ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా, ఓదెల మల్లికార్జున స్వామి దేవస్థానంలో శ్రీధరన్ ప్రత్యేక పూజలు చేశారు.

మనోళ్లూ సిరిమంతులే



- రూ.96.71 కోట్లతో నిజామాబాద్ ఎంపీదే అగ్రస్థానం
- తర్వాతి స్థానాల్లో పాడి కౌశిక్ రెడ్డి, కె.సంజయ్
- ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల ఆస్తుల వివరాలు వెల్లడి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నామినేషన్ల పర్వం పూర్తయింది. ఎన్నికల సంఘానికి అభ్యర్థులు తమ అఫిడవిట్లు అందజేశారు. జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల నుంచి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఎన్నికల అఫిడవిట్‌లలో వెల్లడించిన ఆస్తుల వివరాల ప్రకారం.. కోరుట్ల నుంచి పోటీ చేస్తున్న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ రూ.96.71 కోట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. తర్వాతి స్థానాల్లో హుజూరాబాద్ నుంచి పోటీ చేస్తోన్న బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ కె.సంజయ్ నిలిచారు.

ముగిసిన నామినేషన్లు..

12 నియోజకవర్గాల్లో మొత్తం 329 మంది బరిలో ఉన్నారు. వీరంతా 605 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. గరిష్ఠంగా జగిత్యాలలో 58 మంది అభ్యర్థులు పోటీ పడుతూ.. 102 సెట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. తర్వాతి స్థానంలో హుజూరాబాద్ నిలిచింది. చివరి స్థానంలో చొప్పదండి, ధర్మపురి ఉన్నాయి. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులందరూ ఇక ప్రచారంపై దృష్టిసారించనున్నారు.

నియోజకవర్గాల వారీగా అభ్యర్థులు, నామినేషన్ల వివరాలు

నియోజకవర్గం	మొత్తం అభ్యర్థులు	నామినేషన్లు
కరీంనగర్	23	35
చొప్పదండి	18	37
మానకొండూర్	20	42
హుజూరాబాద్	33	62
సిరిసిల్ల	23	43
వేములవాడ	22	39
పెద్దపల్లి	30	59
రామగుండం	31	51
మంథని	28	48
జగిత్యాల	58	102
కోరుట్ల	25	50
ధర్మపురి	18	37
మొత్తం	329	605

కరీంనగర్:
గంగుల కమలాకర్: రూ.25.50 కోట్లు
బండి సంజయ్: రూ.42 లక్షలు

చొప్పదండి:
రవిశంకర్ రూ.1.7 కోట్లు
మేడిపల్లి సత్యం: రూ.2.10 కోట్లు
బొడిగె శోభ: రూ.1.78 కోట్లు

మానకొండూరు:
కవ్వంపల్లి సత్యనారాయణ: రూ.7.88 కోట్లు
రసమయి బాలకిషన్: రూ.2.63 కోట్లు
ఆరెపల్లి మోహన్: రూ.41.21 లక్షలు

హుజూరాబాద్:
పాడి కౌశిక్‌రెడ్డి: రూ.51.36 కోట్లు
వొడితెల ప్రణవ్: రూ.9.63 కోట్లు
ఈటల రాజేందర్: రూ.12.12 కోట్లు

సిరిసిల్ల:
కె.తారకరామారావు: రూ.11.34 కోట్లు
కేకే.మహేందర్‌రెడ్డి: రూ.8.36 కోట్లు
రాణీరుద్రమ: రూ.1.18 కోట్లు

వేములవాడ:
చల్మెడ లక్ష్మీనరసింహారావు : రూ.26.39 కోట్లు
చెన్నమనేని వికాస్‌రావు : రూ.7.01 కోట్లు
ఆది శ్రీనివాస్: రూ.1.14 కోట్లు

జగిత్యాల:
ఏలేటి జీవన్‌రెడ్డి : రూ.2.93 కోట్లు
డాక్టర్ సంజయ్: రూ.11.09 కోట్లు
భోగ శ్రావణి: రూ.49.13 లక్షలు

కోరుట్ల:
ధర్మపురి అర్వింద్: రూ.96.71 కోట్లు
కల్వకుంట్ల సంజయ్: రూ.40.44 కోట్లు
జువ్వాడి నర్సింగరావు: రూ.15.13 కోట్లు

ధర్మపురి:
కొప్పుల ఈశ్వర్ : రూ.1.06 కోట్లు
అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ : రూ.12 లక్షలు

పెద్దపల్లి:
దాసరి మనోహర్‌రెడ్డి: రూ.32.72 కోట్లు
విజయరమణారావు: రూ1.16 కోట్లు
దుగ్యాల ప్రదీప్‌రావు: రూ.1.09 కోట్లు

మంథని:
దుద్దిళ్ల శ్రీధర్‌బాబు : రూ.3.17 కోట్లు
పుట్ట మధుకర్ : రూ.1.04 కోట్లు
సునీల్‌రెడ్డి : రూ.3.89 కోట్లు

రామగుండం:
కోరుకంటి చందర్ : రూ.46.29 లక్షలు
రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్: రూ.1.16 కోట్లు
కందుల సంధ్యారాణి : రూ.11.65 లక్షలు

న్యూస్‌రీల్

నాణ్యమైన బోధన చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ధర్మారం: ప్రణాళిక బద్ధంగా విద్యాబోధన చేసి ఉత్తీర్ణత శాతం పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. పాఠశాల అభివృద్ధి, కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం, ఎంపీడీవో జయశీల, మండల విద్యాధికారి ఛాయాదేవి, ప్రధానోపాధ్యాయుడు సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి



తేమశాతం పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

ధర్మారం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆదేశించారు. ఖిలావనపర్తిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లర్లు ధాన్యంలో కోత విధించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోండి



ప్రతిజ్ఞ చేస్తున్న కార్మికులు

గోదావరిఖని: అర్హులైన ప్రతీఒక్కరు తమ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ కోరారు. శుక్రవారం జీడీకే–2వ గనిపై ఓటుఅవగాహన సదస్సు నిర్వహించారు. రాబోయే ఐదేళ్లు పాలించే నాయకులను ఎన్నుకునే అవకాశం మన ముందుందన్నారు. నిర్భయంగా, స్వచ్ఛందంగా తమ ఓటుహక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈసందర్భంగా చైతన్య రథంతో కళాజాత ఓటుహక్కుపై అవగాహన, ప్రాధాన్యత గురించి ఆట, పాటలతో వివరించింది. కార్యక్రమంలో స్వీప్ జిల్లా నోడల్ అధికారి రావుఫ్‌ఖాన్, రామగుడం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్, మెప్మా అర్బన్ పీడీ రజని, గని కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కళోత్సవ్ పోటీలు



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

పెద్దపల్లిరూరల్: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం జిల్లాస్థాయి కళోత్సవ్ పోటీలు నిర్వహించారు. ఎంపికైన కళాకారులకు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారని జిల్లా సెక్టోరల్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. ఓకల్ మ్యూజిక్, ఫోక్, డ్రామా, చిత్రలేఖనం, ఇన్‌స్ట్రుమెంటల్‌మ్యూజిక్ తదితర విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పలు మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా హెచ్‌ఎం ఆగయ్య, ప్రవీణ్, గాయత్రీ, ఎంఈవో సురేందర్‌కుమార్, సీఆర్పీలు యూసుఫ్, రవీందర్, వెంకటేశం, సుధాకర్, శ్రీనివాస్, శ్రీలత వ్యవహరించారు.

క్వింటాలు పత్తి ధర రూ.6,680

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పత్తి క్వింటాలు ధర గరిష్ఠంగా రూ.6,680 పలికింది. కనిష్ఠంగా రూ.5,703 పలుకగా సగటున రూ.6,501గా నిర్ణయించినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ ఈసందర్భంగా తెలిపారు.

మహిళా అధికారులే కీలకం

- శాంతిభద్రతల పరిరక్షణలో రామగుండం సీపీ రెమా రాజేశ్వరి
- ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌గా అరుణశ్రీ
- మీడియా ఇన్‌చార్జిగా రజని
- అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేకం



రామగుండం ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం

గోదావరిఖని: రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం ఆవిర్భవించాక ఒక్క మహిళ కూడా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించలేదు. కానీ, ప్రస్తుత ఎన్నికల్లో మహిళా అధికారుల కనుసన్నల్లోనే ఎన్నికల ప్రక్రియ సాగుతోంది. శాంతిభద్రల విభాగంలో రామగుండం సీపీ రేమా రాజేశ్వరి, పెద్దపల్లి డీసీపీ చేతన, ఎన్నికల ప్రక్రియలో రామగుండం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అరుణశ్రీ సారథ్యం వహిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో వీరే ప్రత్యేకత చాటుతున్నారు. మేడారం నియోజకవర్గం నుంచి విడిపోయి 2009లో రామగుండం నియోజకవర్గం ఆవిర్భవించింది. మేడారం(ఎస్సీ–జనరల్)గా ఉండగా రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడిన తర్వాత జనరల్‌కు కేటాయించారు. దీంతో గడిచిన 14ఏళ్లలో ఇక్కడ మహిళా అభ్యర్థులెవరూ ఎమ్మెల్యేగా గెలుపొందలేదు. ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో శాంతిభద్రతలు, ఎన్నికల నిర్వహణలో మహిళలే ప్రధాన భూమిక పోషిస్తున్నారు. రామగుండం సీపీ రెమా రాజేశ్వరి మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల ఎన్నికల శాంతిభద్రతల బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాబాస్‌గా డీసీపీ చేతన జిల్లా ఎన్నికల శాంతిభద్రతల విధులు సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎన్నికల నిర్వహణలో కీలకమైన రెవెన్యూ విభాగంలో రామగుండం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జె.అరుణశ్రీ వ్యవహరిస్తున్నారు. లోతుగా వెళ్తే.. రామగుండం ఎన్నికల మీడియా ఇన్‌చార్జిగా మెప్మాపీడీ రజ కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా ఎన్నికల నిర్వహణలో అతివలే అగ్రభాగాన నిలుస్తుండటం చర్చనీయాంశమైంది.

ఎన్నికల్లో ఆయనకు గుణపాఠం చెప్పాలి

- మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి

ధర్మారం: అబద్ధాలతో తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి కోరారు. బస్సుయాత్రలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని మాటతప్పిన కేసీఆర్.. అదేదారిలో వెళ్తూ అన్నిరంగాల్లో ప్రజలను మోసం చేస్తూ ప్రజాధనం దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఓటమి చెందిన వెంటనే విదేశాలకు పారిపోతారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం నిర్మాణంలో 40శాతం కమీషన్ కల్వకుంట్ల కుటుంబం తీసుకుందని ఆరోపించారు. రైతుబంధు పథకంతో సామాన్య రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకపోగా.. బడా భూస్వాములకు విదేశాలలో ఉంటూ ఇక్కడ వందలాది ఎకరాలు కొనుగోలు చేసిన వారికే ప్రయోజనకరంగా ఉందన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. ఉమ్మడి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక కన్వీనర్ కాకతీయ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ కొడారి అంజన్న, నాయకులు తిరుపతిరెడ్డి, నర్సింహం, జనార్దన్, సూర్యనారాయణ, రూప్లానాయక్ ఉన్నారు.

మీకు తెలుసా?

వేలుకు సిరాచుక్క



ఎన్నికల్లో పారదర్శకత, బోగస్ ఓటర్లను అరికట్టేందుకు సిరాచుక్కను వేలిపై పెడుతున్నారు. ఇది ఒక్కసారి వేలుపై పెడితే 72 గంటల వరకూ చెరిగిపోదు. ఓటుహక్కు వినియోగించుకున్నట్లు గుర్తుగా వేలిపై సిరాగుర్తును 2006 ఫిబ్రవరి 1నుంచి చూపుడు వేలుగోరు పైభాగం నుంచి కింది వరకు గీతలా వేస్తున్నారు. అంతకుముందు గోరు కింద చర్మంపై పెట్టేవారు.

వేలు లేకపోతే..

ఎడమచేతి చూపుడువేలు లేకపోతే వారి మధ్యవేలుకు లేదా బొటన వేలుకు సిరాచుక్క పెడుతారు. మొత్తంగా ఎడమచేతి లేకపోతే కుడిచేతి చూపుడు వేలుకు పెడతారు. రెండు చేతులకు వేళ్లులేని పక్షంలో చేతి పైభాగంలో సిరాచుక్క గుర్తు పెడతారు.

ఓటరు కార్డు తొలిసారి..

ఒకరికి బదులు మరొకరు ఓటు వేయకుండా ఓటరు కార్డును తీసుకొచ్చారు. జాబితాలోని క్రమసంఖ్య ప్రకారం ఓటరు ఫొటోను కార్డుపై ముద్రించి 1995 నుంచి ఇస్తున్నారు. గతంలో బ్లాక్ అండ్ వైట్‌లో ఉండగా, ప్రస్తుతం కలర్‌లో డిజిటల్ విధానంలో ముద్రించి అందిస్తున్నారు.

1950 చరిత్ర..

అన్ని జిల్లాల్లో కేంద్రఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నంబర్ 1950 అమలులోకి తెచ్చింది. ఈనంబరుతోనే దేశవ్యాప్తంగా కాల్‌సెంటర్లు ప్రారంభించింది. అయితే అధికారులు టోల్ ఫ్రీకి ఈ సంఖ్యను కేటాయించటంలో ఓ ప్రత్యేకత ఉంది. దేశంలో ఎన్నికల సంఘం 1950లో ఏర్పడింది. అప్పటినుంచి సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికలను ఈ సంఘమే పర్యవేక్షిస్తోంది. ఎన్నికల సంఘం ప్రారంభమైన ఏడాది గుర్తుగా ఈ నంబరు కేటాయించారు. – సాక్షి, పెద్దపల్లి

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా..



జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్

- నేడు గోదావరిఖనికి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్
- స్టేడియంలో సభ ఏర్పాట్లు పరిశీలన

గోదావరిఖని: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శనివారం గోదావరిఖనిలో పర్యటించనున్నట్లు రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీపీఎల్ ప్లాంటు పునర్నిర్మాణం, కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాల చెల్లింపు, సింగరేణి కార్మికుల్లో సొంత ఇంటి కల నెరవేర్చేలా హామీలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులకు 250 చదరపు గజాల స్థలం కేటాయింపు, ఆర్ఎఫ్‌సీఎల్‌లో మోసపోయిన నిరుద్యోగులకు పూర్తిగా డబ్బులు ఇప్పించి న్యాయం చేస్తామన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న బిహారీలను తరిమికొడతామన్నారు. బొందలగడ్డగా మారిన రామగుండం ప్రాంతాన్ని స్మార్ట్‌సిటీగా నిర్మిస్తామని, రాజకీయ నిర్బంధంలో సింగరేణి కంపెనీ ఉందని, దాన్ని కాపాడటమే లక్ష్యంగా తమ పార్టీ ముందుకెళ్తుందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాశ్, మారెల్లి రాజిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ పార్టీ నుంచి సుధామల అరుణ్‌సాయి కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని ఆయన సూచించారు. అలాగే మాజీ కార్పొరేటర్ కత్తరమల్ల సుజాత–రమేశ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అనుమతిలేని ప్రచార వాహనాలపై చర్యలు

పెద్దపల్లిరూరల్: అభ్యర్థులు తమ ప్రచారానికి వినియోగించే వాహనాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని రామగుండం అసెంబ్లీ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్‌రాణ అన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు లోబడి ప్రచారం చేసుకోవాలని, ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. రాజకీయ ప్రకటనలు, ప్రచారాల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు నగదు, మద్యం తదితర వాటిపై 1950, సివిజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులపై ప్రతీరోజు సకాలంలో నివేదిక అందజేయాలని సూచించారు.

ఎన్ని'కళ' ఉపాధి

- కళాకారులకు చేతినిండా పని
- స్పెషల్ అట్రాక్షన్‌గా ఆటాపాట
- సభికులను ఉత్తేజపరుస్తున్న కళాకారులు





వేదికపై ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

ఇకోల్‌సిటీ(రామగుండం): ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిరుద్యోగులైన కళాకారులకు ఉపాధి మెరుగైంది. ప్రధాన రాజకీయ పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఖర్చుకు వెనుకాడకుండా ఎన్నికల్లో పోటీపడుతున్నారు. తమ ప్రచారం ఆకట్టుకునేలా, ప్రజల మనసు హత్తుకునేలా కళాకారుల సాయం తీసుకుంటున్నారు. దీంతో వారికి డిమాండ్ ఏర్పడింది. అభ్యర్థులు తొలుత అడ్వాన్స్ చెల్లించి మరీ ఒప్పందం చేసుకున్నారు. జానపద గాయకులు, డ్యాన్సర్లు, ఆర్కెస్ట్రా, డప్పు కళాకారులు, కోలాటాలు ఆడే మహిళలు, ఒగ్గడోలు, గుస్సాడి కళాకారుల సందడి అభ్యర్థు ప్రచారాల్లో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తోంది.

వేదికలపై సందడే సందడి..

- కళాకారులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించడంలేదు.
- డప్పుల దరువు, డోలు మోతలు, జానపద ఆట, పాటలు, డీజే సౌండ్స్‌తో కళాకారులు గజ్జకట్టి గంతేస్తూ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నారు.
- ఎన్నికల ప్రచారంలో దుమ్ము రేపుతున్నారు.
- ఆటాపాటలతో హోరెత్తిస్తున్నారు.
- వివిధ రాజకీయ పార్టీల తరఫున ఆడి పాడుతున్న కళాకారులు అభ్యర్థుల ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.
- వారి ఆటాపాటలు అభ్యర్థుల ప్రచారానికి అదనపు బలంగా చేకూరుస్తున్నాయి.

బృందాలుగా ఏర్పడి..

ఎనిమిది నుంచి పది మంది కళాకారులు కలిసి బృందంగా ఏర్పడి ప్రదర్శనలు ఇస్తున్నారు. రోజూ ఒక్కో కళ బృందానికి రూ.6వేల నుంచి రూ.10 వేల వరకు అభ్యర్థులు చెల్లిస్తున్నారు. దీనితోపాటు భోజన వసతి కూడా కల్పిస్తున్నారు. సుమారు మూడేళ్లుగా ఆర్థిక ఇబ్బందుల్లో నలిగిపోతున్న కళాకారులకు ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలు ఉపాధి కల్పించి ఊరటనిస్తున్నాయి.

ప్రభుత్వం గుర్తించాలి



సుమారు ముప్పయి ఏళ్లుగా జానపద పాటలు పాడుతూ, డప్పు కొడుతూ, కాళ్లకు గజ్జగట్టి ధూంధాం కార్యక్రమాల్లో పాల్గొంటున్న. ప్రజలను చైతన్య పరుస్తూవస్తున్న. కళనే నమ్ముకొని బతుకుతున్న. ఏళ్లుగా ఆర్థిక ఇబ్బందుల్లో తల్లడిల్లుతున్న. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలు తాత్కాలిక ఉపాధి కల్పిస్తున్నయి. కానీ ఆర్థిక ఇబ్బందులు మమ్మల్ని రోడ్డున పడేస్తాయోనని భయంగా ఉంది. ప్రభుత్వం మమ్మల్ని గుర్తించాలె.

– గాజుల రమేశ్, కళాకారుడు, గోదావరిఖని

మూడేళ్ల తర్వాత పని..



మూడేళ్లుగా ఉపాధిలేదు. తీవ్రఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నం. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలతో మాలాంటి వాళ్లకు కూడా కాస్త ఉపాధి లభిస్తోంది. 35 ఏళ్లగా సౌండ్ సిస్టమ్ నిర్వహిస్తున్నం. ఇంతటి ఆర్థిక ఇబ్బందులు గతంలో ఎప్పుడూ చూడలేదు. నా దగ్గర ఎనిమిది మంది సిబ్బంది పనిచేస్తున్నరు. ఈ ఎన్నికల్లో వచ్చిన డబ్బుల నుంచి ఒక్కొక్కరికి రోజుకు రూ.800 చొప్పున చెల్లిస్తున్న.

– గౌర్ర రాజు, సౌండ్స్ నిర్వాహకుడు, గోదావరిఖని

డ్యాన్సర్‌గా గుర్తింపు



తెలంగాణ ఉద్యమంలో వేదికలపై జానపద పాటలపై చేసిన డ్యాన్స్‌లతో ప్రజల నుంచి మంచిగుర్తింపు వచ్చింది. 19 ఏళ్లుగా నృత్య కళాకారిణిగా రాణిస్తున్న. ఎన్నికలప్పుడే అన్నిపార్టీలకు కళాకారులు గుర్తుకొస్తరు. ఈ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏర్పడనున్న కొత్త ప్రభుత్వం మాకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి.

– మేకల శ్రావణి, కళాకారిణి, గోదావరిఖని

క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న దాదాపు 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఉద్యోగ భద్యత కల్పించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ జోన్–4 కాంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్మికుల బతుకులు మారుస్తానని, పర్మినెంట్ చేస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన పాలకులు ఆ హామీలు విస్మరించారని విమర్శించారు. సింగరేణిలో లాభాలకు కారణమైన వారి ఓట్లతో గెలిచిన కోల్‌బెల్ట్ ఏరియా ఎమ్మెల్యే, ఎంపీలు, నాయకులు ఎనాడూ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై మాట్లాడలేదని పేర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వచ్చాయని ఓట్లు అడగడానికి వస్తున్నారని, వారితో జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు గట్టయ్య, పోచం, రాయమల్లు, సుగుణ, విజయలక్ష్మి, మల్లేశ్వరి, విజయ, సమ్మయ్య, రవికుమార్, శంకరయ్య పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీకి విఫలయత్నం

ధర్మపురి: ధర్మపురిలోని తోట్లవాడకు చెందిన ఒజ్జ నర్సవ్వ అనే వృద్ధురాలు శుక్రవారం సాయంత్రం పిండి పట్టించేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. ధర్మపురిలోని దేవాలయం వెనక భాగానున్న సందులో ఇద్దరు గుర్తుతెలియని వక్తులు బైక్‌పై వచ్చి వృద్ధురాలి మెడలో ఉన్న పుస్తెల తాడు ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం చేశారు. అయితే ఆమె పుస్తెల తాడు చోరీకి గురైందని భావించి, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల తనిఖీలో పుస్తెల తాడు సంఘటన స్థలంలోనే దొరికింది. పుస్తెల తాడు రెండున్నర తులాలుంటుందని బాధితురాలు తెలిపింది.

కువైట్‌లో యువకుడి మృతి

చందుర్తి(వేములవాడ): జీవనోపాధికి గల్ఫ్ దేశం పయనమైన ఓ యువకుడు జ్వరంతో మరణించాడు. చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో శుక్రవారం విషాదం నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రేగుల బాబు(36) అనే యువకుడు 11నెలల క్రితం జీవనోపాధి కోసం కువైట్ వెళ్లాడు. 20రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నట్లు అతడి స్నేహితులు ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. గదిలో ఉన్న బాబు శుక్రవారం ఉదయం తలనొప్పిగా ఉందని చెప్పి కుప్పకూలిపోయాడు. ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడికి భార్య కల్యాణి, కూతురు(11), కుమారుడు(13) ఉన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులోని పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మండలంలోని కోరుట్లపేటకు చెందిన సడిమెల సాయి తన బైక్‌పై ఎల్లారెడ్డిపేటకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఆటో వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ సాయిని స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడు చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడ్డ యువకుడిని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు

- పారిశుధ్య వాహనాలు, యంత్రాలు అధ్వానం
- పనికి రాకుండాపోయిన అత్యాధునిక యంత్రాలు
- ఇప్పటికే మాయమైన పలు విడిభాగాలు
- చోద్యం చూస్తున్న బల్దియా పాలకులు, అధికారులు
- రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో దుస్థితి

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

కోల్‌సిటీ(రామగుండం): సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ కోసం రూ.లక్షలు వెచ్చించి రామగుండం కార్పొరేషన్ కొనుగోలు చేసిన అత్యాధునిక యంత్రాలు, వాహనాలు పనికి రాకుండా పోతున్నాయి. రెండేళ్ల కిత్రం రూ.45 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన హుక్ లోడర్ ట్రక్ ఒక్కరోజు కూడా ఉపయోగించకుండానే చెత్తకుప్పల్లో పడేశారు. చెత్తను కాల్చి బూడిదగా మార్చడానికి రూ.39 లక్షలు వ్యయం చేసి రెండున్నరేళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్లాస్టిక్ కోర్–వేస్ట్ డెస్ట్రక్షన్ సిస్టమ్ యంత్రాన్ని నిర్లక్షంగా వదిలేశారు. మిక్సిడ్ చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడానికి రెండున్నరేళ్ల క్రితం రూ.70 లక్షలతో కొనుగోలు చేసిన రెండు స్టాటిక్ కంపాక్టర్లను ఒక్క రోజూ కూడా ఉపయోగించలేదు. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన అత్యాధునిక యంత్రాలు, వాహనాలను పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇప్పటికే ఈ యంత్రాలకు చెందిన ముఖ్యమైన కొన్ని విడిభాగాలు చోరీకి గురయ్యాయి. ఈ వైఖరికి బల్దియా ప్రజలు ముక్కన వేలేసుకుంటున్నారు. ‘సాక్షి’ నిర్వహించిన గ్రౌండ్ రిపోర్టులో ఈ వాస్తవాలు వెలుగు చూశాయి.



రూ.70 లక్షల స్టాటిక్ కంపాక్టర్లు నిరుపయోగం

ఈ చిత్రంలో కనిపిస్తున్న యంత్రం పేరు స్టాటిక్ కంపాక్టర్. అధికారులు కొనుగోలు చేశారు. ఒక్కోస్టాటిక్ కంపాక్టర్ 10.5 క్యూబిక్ మీటర్లు ఉండగా, ఇందులో సుమారు 9 నుంచి 10 మెట్రిక్ టన్నుల చెత్తను నింపవచ్చు. ఒక స్టాటిక్ కంపాక్టర్‌ను గౌతమినగర్‌లో, మరొక స్టాటిక్ కంపాక్టర్‌ను మల్కాపూర్ శివారులోని స్లాటర్‌హౌస్ వద్ద నిర్వహణ కోసం ఏర్పాటు చేశారు. కానీ వీటిని వినియోగించకపోవడంతో గౌతమినగర్‌లోని డీఆర్‌సీ సెంటర్‌లో నిర్లక్ష్యంగా మూలనపడేశారు.

చెత్త కుప్పల్లో విలువైన హుక్ లోడర్ ట్రక్



ఇలా చెత్త కుప్పల్లో నిర్లక్ష్యంగా వదిలేసిన వాహనం పేరు హుక్ లోడర్ ట్రక్. రెండేళ్ల క్రితం రూ.45 లక్షల వ్యయంతో దీనిని కొనుగోలు చేశారు. చెత్త నిండిన స్టాటిక్ కంపాక్టర్లను హుక్ లోడర్ ట్రక్‌కు తగిలించుకొని డంపింగ్ యార్డులకు తరలిస్తారు. కానీ కొనుగోలు చేసిన దగ్గర్నుంచి ఒక్కరోజు కూడా దీనిని ఉపయోగించలేదు. అదీకాక ఈ వాహనాన్ని గౌతమినగర్‌లోని డంపింగ్ యార్డు చెత్త కుప్పల్లో నిర్లక్ష్యంగా వదిలేశారు. రూ.లక్షలు వెచ్చించిన అధికారులు పర్యవేక్షణ చేపట్టకపోవడంతో ఈ వాహనం తుప్పుపడుతోంది. వాహనం వాడకముందే కంపెనీ ఇచ్చిన వారంటీ, గ్యారంటీ కూడా పూర్తి అయ్యిందని తెలుస్తోంది.

అలంకారప్రాయమే



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆధునిక యంత్రం పేరు ప్లాస్టిక్ కోర్–వేస్ట్ డెస్ట్రక్షన్ సిస్టమ్. రెండున్నరేళ్ల క్రితం పట్టణ ప్రగతి నిధులు రూ.39 లక్షల వ్యయంతో దీనిని కొనుగోలు చేశారు. నగరంలో సేకరించిన మిక్సిడ్ చెత్తను ఈ యంత్రంలో పోసికాల్చివేస్తే బూడిదగా మారుతుంది. ఈ బూడిదను వివిధ అవసరాలకు ఉపయోగించుకోవడానికి దోహదపడుతుందని యంత్రాన్ని కొనుగోలు చేశారు. యంత్రాన్ని సరఫరా చేసిన ఏజెన్సీ ప్రతినిధులు రెండున్నరేళ్ల క్రితం బల్దియాకు అప్పగించడంతోపాటు దాన్ని ట్రాయల్ రన్ చేసి పారిశుధ్య అధికారులకు శిక్షణ కూడా ఇచ్చినట్లు వెల్లడిస్తున్నారు. కానీ ఇప్పటి వరకు ఈ యంత్రం ఉపయోగించిన దాఖలాలు లేవు. విద్యుత్ సరఫరా లేక ఇది అలంకారప్రాయమైంది. విడిభాగాలు చోరీకి గురికావడంతో పనికిరాకుండా మారింది. దీన్ని వినియోగంలోకి తేవాలంటే మరో రూ.5లక్షల వరకు ఖర్చు చేయాలి.

వినియోగంలోకి తెస్తాం



ఆధునిక యంత్రాలను వినియోగంలోకి తెస్తాం. నేను కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ప్లాస్టిక్ కోర్–వేస్ట్ డెస్ట్రక్షన్ సిస్టమ్ వినియోగంలోకి తేవడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆదేశాలు ఇవ్వడంతోపాటు ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా కోసం అధికారులతో చర్చించాం. సరఫరా చేసిన ఏజెన్సీతో కూడా మాట్లాడాం.

– సీహెచ్ నాగేశ్వర్, బల్దియా కమిషనర్

ఇది బాధ్యతారాహిత్యం



మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటేషన్ మెరుగుపర్చడానికి రూ.లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన అత్యాధునిక యంత్రాలు, వాహనాలను ఉపయోగించకుండానే మూలనపడేయడం బాధ్యతారాహిత్యమే. పాలకులు, అధికారులే బాధ్యత వహించాలి. ప్రతినెలా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించే పాలకులు, కీలమైన ఈ ఆధునిక వాహనాలు, యంత్రాలు పనిచేయకపోవడంపై రెండేళ్లుగా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– ఎండీ.ఇబ్రహీం, గోదావరిఖని

జాతీయ పోటీలకు ఆతిథ్యం

- పలు రాష్ట్రాలకు ఆతిథ్యం ఇవ్వనున్న సింగరేణి
- దేశవ్యాప్తంగా 28జట్ల హాజరు
- దశాబ్దం తర్వాత సింగరేణికి చాన్స్



గోదావరిఖని: దశాబ్దం తర్వాత ఆలిండియా రెస్క్యూ పోటీలకు సింగరేణి ఆతిథ్యం ఇస్తోంది. వచ్చేనెల 10నుంచి 15వ తేదీ వరకు జాతీయ స్థాయి రెస్క్యూ పోటీలు ఆర్జీ–2 ఏరియాలో నిర్వహించనున్నారు. ఈమేరకు యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. ఈ పోటీల్లో పాల్గొనే జట్లకోసం ఇటీవల ఇంటర్‌ఏరియా రెస్క్యూ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన బ్రిగేడియర్లను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 52వ ఆలిండియా మైన్స్ రెస్క్యూ పోటీలకు దేశవ్యాప్తంగా 18కంపెనీలకు చెందిన 28జట్లు హాజరు కానున్నాయి. ఇందులో 11కోల్ కంపెనీలు, 7మెటల్ కంపెనీలు పాల్గొంటున్నాయి. సింగరేణి తరఫున రెండుజట్లు పాల్గొననున్నాయి. హిందూస్థాన్ జింక్ లిమిటెడ్‌కు చెందిన ఒక మహిళా జట్టు పాల్గొనడం విశేషం.

సింగరేణికి ప్రతిష్టాత్మకం

- జాతీయస్థాయి పోటీలను సింగరేణి ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.
- పలు రాష్ట్రాల నుంచి వచ్చే రెస్క్యూ జట్లకు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తోంది.
- ప్రమాదాలు జరిగిన సమయంలో తామున్నామంటూ కార్మికుల్లో ధైర్యం, భరోసా కల్పించే రెస్క్యూ సింగరేణికి గుండెకాయలాంటిది.
- అద్భుత ప్రతిభతో ఆలిండియా రెస్క్యూ పోటీల్లో అత్యుత్తమ సత్తా కనబర్చుతోంది.
- ఇప్పటికే డబుల్ హాట్రిక్‌తో సింగరేణి రెస్క్యూ ప్రత్యేకత చాటుకుంది.
- 1994 నుంచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్న సింగరేణి.. గడిచిన 28ఏళ్లుగా అనేక అవార్డులు, రివార్డులు సొంతం చేసుకుంది.
- అత్యాధునిక శిక్షణతో భూగర్భగనుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు తామున్నామంటూ కార్మికుల్లో భరోసా నింపుతోంది.
- ఆలిండియా 51వ, రెస్క్యూ పోటీలు గతేడాది రాజస్తాన్ రాష్ట్రంలోని ధరిభాలో హిందూస్తాన్ జింక్ లిమిటెడ్(హెచ్‌జడ్ఎల్)లో జరిగాయి.

పకడ్బందీ ఏర్పాట్లు

ఆలిండియా రెస్క్యూ పోటీల్లో ఈసారి కూడా సింగరేణి నుంచి రెండుజట్లు పాల్గొంటున్నాయి. పలుసార్లు ఆలిండియా రెస్క్యూ పోటీల్లో ఓవరాల్ చాంపియన్ కైవసం చేసుకుని సింగరేణి సత్తా చాటుతోంది. ట్రర్న్ అవుట్ అండ్ డ్రిల్, థియరీ టెస్ట్, స్టాట్యుటరీ టెస్ట్, ఫస్ట్ ఎయిడ్ ప్రాక్టికల్, ఫ్రెష్ ఎయిర్ బేస్ అండ్ డ్రిల్, రెస్క్యూ అండ్ రికవరీ డ్రిల్, క్యాప్టెన్ రిపోర్ట్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు.

బడ్జెట్ భారీగా కేటాయింపు..

- మెయిన్ రెస్క్యూస్టేషన్‌తోపాటు భూగర్భగనిలో పోటీలు నిర్వహించాలని అధికారులు యోచిస్తున్నారు.
- ఇందుకోసం అన్నిరాష్ట్రాల నుంచి వచ్చే జట్లకు ఆతిథ్యం, ఏర్పాట్ల నిర్వహణ కోసం సుమారు రూ.80లక్షల మేర కేటాయించనున్నట్లు సమాచారం.
- జీడీకే–7ఎల్ఈపీ గనిలో ప్రాక్టికల్ పోటీలు నిర్వహిస్తుండగా, మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో మిగితా పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు.

సింగరేణి జట్లు ఇవే

ఆలిండియా రెస్క్యూపోటీల్లో సింగరేణి నుంచి రెండు జట్లు పాల్గొంటున్నాయి. వీటిని ఎంపిక చేసి ఆలిండియా స్థాయిలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సింగరేణి తరఫున పాల్గొనే ఏ,బీ టీం సభ్యుల పేర్లను ఇప్పటికే ప్రకటించారు. ఏ– టీం క్యాప్టెన్‌గా జి.పరమేశ్, బీ – టీం క్యాప్టెన్‌గా కె.అనిల్‌కుమార్‌ను నియమించారు. ఒ.రఘుకుమార్, పి.శ్రీకాంత్, జి.రాకేశ్, సాంబశివుడు, సీహెచ్ సాయికృష్ణ, ఎం.శ్రావణ్, జె.నాగరాజు, ఎం.ప్రవన్‌కుమార్, ఆర్.శ్రీకాంత్, కె.రమేశ్, ఎ.శ్యాంకుమార్, ఎస్.భానుప్రసాద్, జి.శశాంక్, జి.మనోహర్ ఈ జట్లలో ఉన్నారు. పోటీలకు ముందు రెండు జట్లుగా విభజిస్తారు.

బలమైన ప్రజాస్వామ్యం లక్ష్యం

అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి



సాక్షి పీపుల్స్ ఎజెండా

జ్యోతినగర్(రామగుండం): ‘ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం.. అర్హులందరూ తమ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోండి’ అని భారత ఎన్నికల సంఘం సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ – స్వీప్) అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఓటు హక్కు వినియోగం, అవినీతి పద్ధతు నిరోధం, ఎన్నికల యంత్రాంగానికి సాయం చేయడం తదితర అంశాలపై సీప్ అవగాహన కల్పిస్తోంది. తద్వారా పోలింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకుంటోంది. ఈక్రమంలో ‘సాక్షి’ కొందరు ఉద్యోగులను పలుకరించగా..తమ అభిప్రాయాలు ఇలా పంచుకున్నారు..


వేతన సవరణ చేయాలి



ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ చేయాలి. నిర్దేశిత గడువులోగా డీఏ ప్రకటించాలి. ప్రభుత్వం కొత్త విద్యుత్ కేంద్రాల స్థాపనతో రామగుండం పేరు సార్థకతగా మిగిలిపోతుంది.

–లగిశెట్టి రవి, జెన్‌కో, రామగుండం


మనది ప్రజాస్వామిక దేశం



మనది ప్రజాస్వామ్య దేశం. నేనే గొప్ప, నాకన్నా ఎవరూ ఎక్కువ లేరు అనే అహంభావంతో ఉన్న వారికి అపజయం ఎలా ఉంటుందో చూపించిన వజ్రాయుధం ఓటుహక్కు.

–రాజమౌళి, ఉపాధ్యాయుడు, యైటింక్లయిన్‌కాలనీ

ధర తగ్గుతుంది



రామగుండం ప్రాంతంలో కొత్త విద్యుత్ కేంద్రాలు ప్రారంభిస్తే స్థానికులకు తక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్ అందుతుంది. ఏ ప్రభుత్వమైనా థర్మల్ విద్యుత్ కేంద్రాలు స్థాపించాలి.

– గుర్రాల నర్సింహులు, జెన్‌కో, రామగుండం


పారదర్శకత ఉండాలి



రాజకీయ నాయకులు పారదర్శకతతో కూడిన పాలన అందించాలి. ఇతర దేశాల్లో మాదిరిగా రైట్ టూ రికాల్ అనుసరించేలా శాసన సభ, పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలి.

– సతీశ్‌బాబు, ఉపాధ్యాయుడు, గోదావరిఖని


పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలి



తెలంగాణ రాష్ట్రంలోని యువత ఇతర రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఆయా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి.

–నసీరొద్దిన్, హోంగార్డు, యంపీఐ, రామగుండం


విధిగా ఓటువేయాలి



అర్హులైన వారు విధిగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలి. రామగుండంలో పోలింగ్ శాతం తగ్గుతోంది. దీనిని పెంచేందుకు స్వీప్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

– డి.భీమ్‌సింగ్, ఎంపీఐ, రామగుండం


సింగరేణికి అండ



సింగరేణి ఉద్యోగులకు అండగా నిలిచి, హక్కుల సాధనలో కార్మికులతో నడిచే నాయకునికే ఓటువేస్తాం. సింగరేణి మనుగడ, కార్మికుల సంక్షేమం కోసం పాటుపడే వారికే ఓటేస్తాం.

– నాగుల శంకర్, సింగరేణి, గోదావరిఖని

విద్యుత్ కేంద్రాలు కావాలి



ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థానికంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటుచేయాలి. తద్వారా ఉత్పాదక వ్యయం భారీగా తగ్గుతుంది. స్థానిక నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది.

–జె.శ్రీకాంత్, జెన్‌కో, రామగుండం

కాంట్రాక్టు కార్మికులకు దీపావళి బోనస్ చెల్లించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు దీపావళి బోనస్ వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సంఘాల విన్నపం మేరకు బోనస్ ఇచ్చే విషయంలో ఇప్పటివరకు సింగరేణి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈవిషయంలో సింగరేణి యాజమాన్యం సీరియస్‌గా తీసుకొని దీపావళికి ముందే కాంట్రాక్ట్ కార్మికులకు పీఎల్ఆర్ బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఆకుల హరిణ్, సాయవేణి సతీశ్, బండారి శ్యాంసుందర్, గుండబోయిన భూమయ్య, చెన్నూరి రమేశ్, దాడి కుమారస్వామి పాల్గొన్నారు.

వెంటనే చెల్లించాలి

రామగిరి: సింగరేణిలోని కాంట్రాక్టు కార్మికులకు వెంటనే దీపావళి బోనస్ చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. సెంటనరీకాలనీ బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు ఆర్కాల ప్రసాద్ గౌడ్, నాయకులు ఆకుల హరిణ్, సాయివేణి సతీశ్, బండారి శ్యాంసుందర్, భూమయ్య, రమేశ్, కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని సింగరేణి కార్మికుడి మృతి



లక్కాకుల శ్రీనివాస్(ఫైల్)

కమాన్‌పూర్(మంథని): స్థానిక పిల్లపల్లె వద్ద గురువారం సాయంత్రం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో గుండారం గ్రామానికి చెందిన సింగరేణి కార్మికుడు లక్కాకుల శ్రీనివాస్(55) శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రావణ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. శ్రీనివాస్ కమాన్‌పూర్ నుంచి గుండారం వస్తుండగా మసీదులో మౌలానా పనిచేస్తున్న రహ్మత్ అలీ గుండారం నుంచి కమాన్‌పూర్ వెళ్తున్నాడు. ఈక్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో శ్రీనివాస్ తలకు తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీరలించారు. పరిస్థితి విషమంగా ఉండంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ శ్రీనివాస్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రావణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రాములు కేసు నమోదు చేసుకున్నారు.

వాహనాల తనిఖీ



వాహనం తనిఖీ చేస్తున్న విజయ్‌భాస్కర్‌రెడ్డి

మంథని: ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. అంతకు ముందు చెక్‌పోస్టులో తనిఖీలు చేశారు. ఆయన వెంట పెద్దపల్లి డీటీఎఫ్ వినోద్ రాథోడ్, సీఐలు గురువయ్య, విజయ్‌కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, సాయిరాం తదితరులు ఉన్నారు.



ఆరోగ్య ధన ప్రాప్తిరస్తు!

ఇవాళ ధనత్రయోదశి. దీనినే ధన్ తేరస్ అని కూడా అంటారు. ఈ పర్వదినాన సాధారణంగా అందరికీ బంగారం, వెండి, గృహోపకరణాలు, వస్తు వాహనాల వంటి వాటి మీదికే దృష్టి మళ్లుతుంది. ఆరోగ్య ప్రదాత అయిన ధన్వంతరి జయంతి కూడా ఇదే రోజు అని గుర్తు రాదు. అయితే ఆరోగ్యం కూడా ధనమే కాబట్టి ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ఏం చేయాలో తెలుసుకుని అందుకు తగినట్లు నడుచుకుంటే ఆరోగ్య ధనం, ఆరోగ్య మహాభాగ్యం సమకూరుతుంది. ధనత్రయోదశి సందర్భంగా ఆరోగ్య సంపదను ఏవిధంగా పెంపొందించుకోవాలో చూద్దాం...

సంపూర్ణ ఆరోగ్యానికి ఆహార విహారాలు ఎంత అవసరమో, నిత్యం నడక, వ్యాయామం, యోగా కూడా అంతే అవసరం. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు. అజీర్తి నుంచి ఆర్థరైటిస్ వరకు.. బీపీ నుంచి హార్టెటాక్ వరకు, మధుమేహం నుంచి మానసిక సమస్య వరకు ఏదైనా నయం కావాలంటే రోజూ వ్యాయామం, యోగా చేస్తుండాలి.

■ సమయానికి తగు...



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవడం ఎంత అవసరమో ఆ ఆహారాన్ని తగిన సమయానికి తీసుకోవడం కూడా అంతే అవసరం. వేళ తప్పి భోజనం చేస్తే అది మన ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. అందువల్ల ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సరైన సమయాలకు భోజనం చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

■ బ్రేక్ ఫాస్ట్ తప్పనిసరి

రోజూ ఉదయాన్నే టిఫిన్ చేయడం వల్ల ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండగలుగుతారు. కొందరికి అలా బ్రేక్ ఫాస్ట్ చేయడం అలవాటు ఉండదు. అలాంటి వారు అల్పాహారంగా నానబెట్టిన బాదం, ఎండు ద్రాక్ష, వాల్నట్స్, మొలకెత్తిన గింజలు, అవిసెలు, తాజాపండ్లు, కూరగాయల ముక్కలు లాంటివి అయినా తప్పనిసరిగా తీసుకోవాలి.



■ లంచ్‌గా ఇవి...

మధ్యాహ్నపు భోజనంగా సగం కంచంలో తాజా కూరగాయలు, మిగతా సగంలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోవాలి.



రక్తంలో చక్కెర నిల్వల్ని అదుపులో ఉంచుకోవడానికి, లో గ్లైసిమిక్ ఇండెక్స్ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు లాంటి చిరు ధాన్యాన్ని ప్రయత్నించవచ్చు.

ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత మేరకు తగ్గించాలి. ఎందుకంటే, మనం వాడే ప్లాస్టిక్ వస్తువుల నుండి, రోజుకి కొన్ని లక్షల సూక్ష్మరేణువులు విడుదలవుతాయి. వాటిలో ఉండే రసాయనం హార్మోన్ల సమతౌల్యాన్ని దెబ్బ తీస్తుంది.

■ మానసిక దృఢత్వం

మానసిక ఆరోగ్యం బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు. ఇందుకోసం నిత్యం నడక, వ్యాయామం, యోగా తప్పనిసరి. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు.

■ కంటినిండా నిద్ర

కడుపు నిండా తిని కంటి నిండా నిద్ర పోతే ఏ జబ్బూ ఉండదని పెద్దవాళ్లనేవారు. వేళకు తగినంత రాత్రి నిద్ర ఉంటే పొద్దున లేవగానే ఉత్సాహంగా ఉంటుంది. లేదంటే నిస్సత్తువగా... ఏదో పోగొట్టుకున్నట్లుగా అనిపిస్తుంది. నిద్ర లేమి వల్ల రకరకాల ఇతర జబ్బులు వస్తాయి. అందువల్ల వీలయినంత వరకు వయసును బట్టి, చేసే శారీరక శ్రమను అనుసరించి తగినంత నిద్ర పోవడం ప్రతి ఒక్కరికీ అవసరం.



ఈ ధన త్రయోదశి నాడు అందరూ ఆరోగ్య ధనాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తారని, వేయాలనీ ఆశిద్దాం.

మంచి కొవ్వు మంచిదే!



లావవుతామనే భయంతో చాలామంది కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాలను తినడం మానేస్తున్నారు. కొందరైతే నెయ్యి తినడం ఎప్పుడో మానేశారు. అయితే శరీరంలోని ఎ, డి, ఇ, కె విటమిన్లు కొవ్వులో మాత్రమే కరుగుతాయి. కాబట్టి తగిన పరిమాణంలో మంచి కొలెస్ట్రాల్ ఎంతో అవసరం. అలాగని అన్నిరకాల కొవ్వులూ ఆరోగ్యం కాదు. ఇంతకూ ఆరోగ్యకరమైన కొవ్వు లభించాలంటే ఎలాంటి ఆహారాలు తీసుకోవాలో తెలుసుకుందామా?

మీరు ఆరోగ్యం పట్ల చాలా కాన్షియస్‌గా ఉండి..అధిక పరిమాణంలో కొలెస్ట్రాల్ ఉన్న ఆహారాలకు దూరంగా ఉంటే తప్పకుండా ఈ అవకాడోను ఆహారంలో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఉండే మోనోశాచురేటెడ్ కొవ్వు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఆలివ్ ఆయిల్: వేపుళ్లకు దూరంగా ఉండేవారు తప్పకుండా ఆహారాల్లో ఆలివ్ ఆయిల్‌ను తప్పకుండా వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు, మోనోశాచురేటెడ్ కొవ్వులు గుండెను ఆరోగ్యంగా చేసేందుకు సహాయపడతాయి. అంతేకాకుండా శరీర బరువును నియంత్రించేందుకు కూడా సహాయపడతాయి.

పెరుగు: బరువు తగ్గడానికి ఆరోగ్యకరమైన ఆహారాలు తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా తీసుకుంటే శరీరంలోని కొవ్వును సమతుల్యంగా చేస్తుంది. కాబట్టి శరీరం ఆరోగ్యంగా ఉండడానికి తప్పకుండా కొవ్వు పాలతో చేసిన పెరుగు తినడం చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇందులో ఉండే గుణాలు ప్రేగును కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి.

కొబ్బరి: కొబ్బరి లేదా కొబ్బరి నూనె తీసుకోవడం వల్ల శరీరానికి అనేక రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో జీర్ణక్రియను మెరుగుపరిచే చాలా రకాల పోషకాలు దొరుకుతాయి. దీనివల్ల ట్రైగ్లిజరైడ్ ఫుడ్ సులభంగా జీర్ణమవుతుంది. అంతేకాకుండా మలబద్ధకం, ఇతర పొట్ట సమస్యల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.

చేపలు: చేపలలో మంచి కొలెస్టరాల్‌ను పెంపొందించే లక్షణాలున్నాయి. అందుకే ఇతర విధాలైన మాంసాహారాలకు దూరంగా ఉండమని హెచ్చరించే వైద్యులు సైతం పరిమితంగా అయినా చేపలు తీసుకోవచ్చునని చెబుతారు.

బాదం పప్పు, జీడిపప్పు: వీటిని తీసుకోవడం వల్ల కొవ్వు పెరుగుతుందని అనుకుంటాం. అయితే వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు మాత్రమే ఉంటాయి. అందువల్ల బాదం, జీడిపప్పు తీసుకోవడం మంచిది. బాదం పప్పును నీటిలో నానబెట్టి, పైన పొట్టు తీసి తినడం మంచిది. జీడిపప్పును అయితే వేయించకుండా నేరుగా తీసుకోవడం వల్ల మంచి కొలెస్టరాల్ పెంపొందుతుంది.

నెయ్యి: ఇదివరకటిలో ఆహారంలో నేతిని బాగా ఉపయోగించేవారు. అరిసెలు, గారెలు వంటి వాటిని నేతితోనే చేసేవారు. అయితే రానురానూ నెయ్యి తినడం ఆరోగ్యానికి మంచిది కాదనే అభిప్రాయం స్థిరపడిపోయింది. నిజానికి నేతిలో శరీరానికి అవసరమైన పోషకాలెన్నో ఉన్నాయి. అలాగని ముద్ద ముద్దకీ నెయ్యి వేసుకోవడం, నేతితోనే చేసిన డీప్ ఫ్రైలు విపరీతంగా తీసుకోవడం మాత్రం అంత మంచిది కాదు. గేదె నెయ్యి కన్నా ఆవు నెయ్యి మంచిది.

మరకలను మాయం చెయ్యండి ఇలా...



బట్టలపై మరకలు పడ్డప్పుడు డ్రై క్లీనింగ్‌కి ఇద్దామంటే ఆ ధరకు కొత్తదే వస్తుందమే అనిపిస్తుంది. అయితే మరకలను తొలగించుకునేందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవేమిటో చూద్దాం.

మీ దుస్తులు మెరిసేలా చేయాలంటే ఆస్పిరిన్ మాత్రలు బాగా ఉపయోగపడతాయి. ఆస్పిరిన్‌లో ఉండే ఎసిటైల్‌సాలిసిలిక్ ఆమ్లం బట్టలపై పడిన మరకలను తొలగించేందుకు సాయం చేస్తుంది. తెల్లని దుస్తులను నాలుగైదు ఆస్పిరిన్ టాబ్లెట్లు వేసిన నీళ్ల బకెట్‌లో బాగా నానబెట్టండి. తరవాత బట్టల సబ్బుతో ఉతకడమో లేదా వాషింగ్ మెషీన్‌లో వేసి మామూలుగా ఉతికి జాడించి ఆరేస్తే సరి!

రక్తపు మరకలను తొలగించడానికి.. ఆస్పిరిన్‌ను చల్లటి నీటిలో కరిగించి బట్టలను నానబెట్టండి. వేడినీటితో రక్తపు మరకలను తొలగించడానికి ప్రయత్నించవద్దు. ఇది ప్రోటీన్లు గడ్డకట్టడానికి కారణమవుతుంది. ఆ తరువాత మరకను తొలగించడం కష్టం అవుతుంది. చేస్తుంది.

నూనె, గ్రీజు మరకలకు

ఒక నిమ్మకాయను రెండు ముక్కలుగా కోయాలి. ఒక ముక్క మీద ఉప్పు వేసి మరకపై రుద్దాలి. ఇది నిమిషాల్లో బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

వక్కపొడి, పాన్ మసాలా మరకలు

పెరుగు లేదా మజ్జిగను మరక పడ్డ చోట ఉంచి పది నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత శుభ్రమైన నీటితో వస్త్రాన్ని కడగాలి. ఇది బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

టీ-కాఫీ మరకలు

టీ-కాఫీ మరకలు పడ్డప్పుడు ముందుగా గోరువెచ్చటి నీటిలో ఆ వస్త్రాన్ని పదిహేను నిమిషాలు ఉంచిన తర్వాత లిక్విడ్ డిటర్జెంట్లో నానబెట్టాలి. తర్వాత మరక పడ్డ చోట చేతితో రుద్దితే మరకలు తొలగుతాయి.

టర్కీ టవళ్లు, దుప్పట్ల వంటి వాటిని బట్టలుతికే సోడా కలిపిన నీటిలో నానబెట్టి ఉతికితే త్వరగా శుభ్ర పడతాయి.

సినిమా

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ



● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ–మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ– ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు

''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్



● ధనుష్, ఇళయరాజా

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యురీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యురీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ –''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యురి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.



● కాజల్

వేటాడే సత్యభామ

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసినట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక



● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

''మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ– ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.

లింగి లింగిడి..!



● రాహుల్, శివానీ, మిధున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.

ప్రేమలో గీతాశంకరం



● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ– ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.



● జాన్వీ కపూర్

రెండు హృదయాల కల

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చుస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

మాస్ రింగు...



● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్– కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘురామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్



● 'ది ట్రయల్' పోస్టర్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్



''అలా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ–''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.